# దరిద్రమా నీకు కోటి దండాలు!

"ఆపొద్దు... మట్ట మద్దేణంకాడ. మొబ్బు యిడ్సిన ఎండ ముగు తాడులేని గొడ్డు మాదిర్తో తన ప్రెతాపం చూపిస్తా ఉండాది. ఆ ప్రెతాపానికి ఉల్సరకపోయ్ నట్టుండారు జనం. వీదులన్నీ పరిగల పాయ్‌న చేన్లు మాదిర్తో బిసురోమని ఉండాయి. నాలుగ్గాళ్లమండపం కాడ వస్తా ఉండా.

''ఒరే అబ్బోడా! ఈవారం ఏం రాయాలనుకుంటా ఉండావురా??'' అని ముత్తారెడ్డన్న మలేసుకుండె. నిలబడ్తి.

బతుకంటే ఒక సీకి పొద. అది ఒక సిక్కు ముడి. వాడు ఎటుమంటి కారివేది అయినా పొయ్‌పొయ్ ఆ సీకి పొదలో చిగులుకోకుండా పోడు. ఆ చిక్కు ముడి యిప్పుకోవాలని బిక్కరించకుండా పోడు. సీకి పొదలో చిగులుకున్నోడు ఎట్టన్నా యిడిపించు కోవాలని పెరుకులాడే కుందికి ఒక పక్క యిడిపించు కుంటా ఉంటే యింకొక పక్క తగలక పోతా ఉంటింది. చిక్కుముళ్లు యిప్పుకోవాలని అదేపనిగా కూసుంటే ఒక ముడి యిప్పుతా ఉంటే యింకొక ముడి అదెట్టా పడ్తిందో మనకు తెలవకుండానే పడ్తింది.

ముత్తారెడ్డన్న కత అట్టా మాదిరి కతే? అది ఎటుమంటి చిక్కుముడి అయినా సరే! అలాగ్గా యిప్పేస్తాడు. సీకిపొదైతే గుడ్డ సీమంత చినిగిపోకుండా తప్పించు కునేస్తాడు. అటుమంటి మొగలాయి కాబట్టే ''ఓయబ్బో! ఈ చిక్కుముడి యీడేది కాదే? ఈ బారం తీరబొయ్యేది లేదే?'' అనుకుంటా ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి పొయ్యే కుందికి ఎట్టా వచ్చేస్తాడో మహన్నబావుడు కాకితో కబురు అందుకున్నెట్టు వచ్చేస్తాడు. చిటికలో ఆ ముడి యిప్పేస్తాడు.

ముడి యిప్పే వాడే ముడేస్తే?

అందుకే అడిగిందానికి బొదులు సదులు చెప్పకుండా నిలువు గుడ్లేసుకోని చూస్తా ఉండా!

''ఏమిరా అబ్బోడా! ఈ సీమలో చెట్లు మొలిసే చినుకింకా రాల్లేదే? నీ చెవల్లో మాత్రం ఎట్టా మొలిచినాయిరా?'' అనె.

''అన్నా! పైగెనిమ ఉంటింది. కింద గెనిమా ఉంటింది. ఏ గెనిమ మింద ఎవురు వుండారో? వాళ్లు ఎటుమంటి వాళ్లో? వాళ్ల కతా కమామీషు ఏందో? ఆమాత్రం తెలుసుకోకుండా పోలేదు. అయినా వొంగే కుందికీ తోలుకోని తిరిగేది జాస్తి అయిపూడస్తా ఉండాది. ఇంక యిట్టా అవదు. వాడు యిక్లామార్కుడు గూడా కానీ. నువ్వెంత? నీ అనే బారమెంత? అని తిరగబడి తాడోపేడో తేల్సుకుంటే తేల్సుకోవాల. లేకుండాబోతే రాసేదన్నా నిలిపేయాల.''

''నీకేం వచ్చిందిరా పొయ్యేకాలం?''

''అది వొగిటుండి రానన్నా వచ్చినా బాగుండి పోవు గదన్నా?''

''ఎందుకు నాయనా అంత యాష్ట?''

''కాకుండా పోతే ఏందన్నా? మనకొక గొంతు ఉండాది. ఆ గొంతుకొక పలుకు ఉండాది. ఆ పలుకులో వొక జిలుగు ఉండాది. ఆ జిలుగు ఎటుమంటి దన్నా? ఎలుగు యిప్పితే ఎదుటోడి మొకం మొగ్గతొడిగిన రెమ్మ అవితింది. అది నేర్సుకుందామంటే అబ్బితిందా? ఓర్సలేకుండా పోతే వస్తిందా? ఎద్దల గొట్టి ముద్దలు తినే కొంపల్లో బతికి బాల్నాం. పుట్టనక చెట్టనక చెడీబడిగా గాలికి తిరిగినాం. రాయి కొక మాట. రప్ప కొక మాట. పుట్ట కొక మాట. చెట్టు కొక మాట. అలాగ్గా ఎత్తిస్తే నేర్సుకుణ్ణాం. వాళ్ల ఎతలు చూసినాం. వాళ్ల బతుకులు ఎట్టా గాలికి కొట్టుకోని పోతానే ఉండాయ్. కడాన వాళ్ల పలుకైనా యినిపిస్తా మనుకుంటే?...''

''నిన్ను ఎవురు వద్దన్నా్రా?''

''అపబ్రెంశం అయిపోతా ఉండాదంట్నే?''

''ఆ కూత కూసిన యదవెవుడు?''

''ఎవుడో ఒక మొగలాయి. ఇంగవగట్నె గుడ్డయి పోతావుంటే గూడా...''

''ఎప్పుడో ఒకనాటికి అందురు అట్టయి పోవాల్సిన వాళ్లే. అది యిడ్సిపెట్టు. తొందర పడబాక. ఇట్టా మాదిరి కూసే నోర్లన్నీ అవిటి పాటికి అవ్వే మూసుకుంటాయి. దాంతో నీకు పన్లే. ఒరే అబ్బారే! నేనొక మాట చెప్తా యింటావా?''

''నీ మాట ఎప్పుడు యిన్లేదన్నా?''

''అయితే చెప్తా యిను. పొగిడ్తే పొంగొద్దు. తిడ్తే కుంగొద్దు. నీ పని నీది. బృందావనం రంగాచార్యులు చెప్పినాడంటివే? అట్టా మాదిర అప్పుడప్పుడూ ఎనిక్కి తిరిగి చూసుకుంటా ముందుకు పోతా ఉండు. అప్పుడెప్పుడో నువ్వు పుట్టక ముందు. వావిళ్ల వాళ్లు వేమన్న పద్దేలు అచ్చేసినారు. బ్రౌన్‌దొర లేకుండా పొయ్యుంటే వేమన్నలూలే. జానపదాల్ను ఏతాలెత్తిన రామన్నలూలే!

పెద్ద పెద్దోళ్లకే చెల్లలా. నువ్వేందిరా? నిన్న పుట్టి ఈపొద్దు కండ్లు తెరిసినోడివి. ఎద్దు కాల్లో ముల్లంత లేవు. ఎవుడో ఒక మాటంటే దానికే నాలుగ్గాళ్లమండపం మింది కెక్కి నిక్కితే ఎట్రా?''

''నా బాద అది కాదన్నా?''

''పోనీ! ఇంకేందబ్బా?''

''ఆమద్దె ఒకనాడు. మిద్దారికి పొయ్యొండి వస్తా ఉండా. ఐతేపల్లి కాడ టీ తాగదామని అయిదే నిమిశాలు నిలబణ్ణాం. ఆపక్క ఊరోళ్లు. ఒక అయిదారు మంది టీ తాగేదానికి ఆడి కొచ్చిరి. వాళ్లల్లో వాళ్లే మల్లగుల్లాలు పడ్తా ఉండారు. ఆ మాటల్ని అట్టట్టే చెప్తావుండా. యినన్నా.''

''కుండాకోర్ నాయాలు. వాడెంత? వాడి అనేబారమెంత? నిన్న మొన్నటిదాకా చంద్రగిర్లో అయిస్కూలికి పొయ్యేదానికి బస్‌చార్జీ కుణ్ణిందా నాయాలికి? చిల్లరదుడ్లకు చిల్లర మల్లర ఆటలు ఎన్ని ఆణ్ణాడో? ఆ చిల్లరదుడ్లు వొదక్కుండా పోతే సంచీ చంకకు తగిలించుకోని శివుడా! అని ఆ ముక్కోట్లో శివుడ్ని తల్సుకుంటా నడ్సిన నాయాలు. ఈ పొద్దు వాడి కత అట్టాసంరెట్టమందంగా ఉండాదే?''

''మెట్టు దెబ్బలు తిన్నె యాళాయిశేషం అట్టాంటిదిరా. నాయాలు చరచర ఎగబడి పాయనే?''

''మెట్టు దెబ్బలా?''

''వొగిటిగాదు. రొండుగాదు నీపాసుగాల! ఎంచినట్లు ఏడేట్లు. అదిగూడా ఎట్టాంటి యాళ్లో అనుకున్నావ్? పొద్దు గూట్లో పడ్తాపడ్తా ఉండంగా అప్పుడు పడిపాయ అబ్బోడికి!''

''అంతకాడికి ఎందుకొచ్చిందిరా?''

''దోవన పోతా ఉంటామా? ఎవుడి దోవన వాడు గమ్మున పోతావుంటే అది వొక దోవగా ఉంటింది. దోవ తప్పితే? అది ఎవురికన్నా కావచ్చు. చెప్పు దెబ్బలో శాట దెబ్బలో తప్పుతాయా? ఇస్కూలికి పొయ్యే నాయాలు వాడి దోవన వాడు పోవచ్చుగదా? పోతే ఎట్టా? ఎదిగిన బిడ్డెలుండే యింటి కాడికి పొయ్ ఎచ్చులు చూపిస్తే వాళ్లు బొచ్చూడ గొట్నారు. లేకుండాపోతే పొయానికొచ్చిన ఆడపిలకాయిలతోనా పడాసికాలు?''

''ఒరే! పెద్దోళ్లు ఏంచెప్పినారో తెల్సా? పొద్దెక్కే యాళకాడ మెట్టు దెబ్బలు తిన్నోడు చెడి పూడిస్తే కొట్నోడు కోటికి పడిగెత్తతాడంట! అదే పొద్దు పొయ్యే యాళకాడైతే తిన్నోడి జాతకానికి తిరుగుండదంట. కొట్నోడి కొంప ఉరువుండదంట.''

''బలే కరట్టు అయిన మాట చెప్పినారే?''

''ఒరే! వాడి జాతకం మారాలంటే మెట్టుదెబ్బలు తినాలని రాసిపెట్టి ఉణ్ణిందో? లేకుండాబోతే మెట్టుదెబ్బలు తిన్నాక వాడి జాతకం మారిందో? దాంతో మనకి అక్కర్లే. ఆ యదవ మన కండ్ల ముందర పుట్నోడు. ఎంతదా స్టారు తిరిగితే మాత్రం పలానా ఊరోళ్ల

కత నా దగ్గిర ఎత్తద్దంటడా? అందుకేరా పెద్దోళ్లు కూటికి కలిగిందా కుంగాల. గుడ్డకు కలిగిందా ఎత్తి నడవాల. అదికారం వచ్చిందా తలొంచి నడవాల?'' అన్నారు

ఆ మాట యింటానే ముత్తారెడ్డన్న-

''ఎట్టెట్టా? ఆ మాట యింకొక సారి అన్నా!'' అనె.

''కూటికి కలిగిందా కుంగాల. గుడ్డకు కలిగిందా ఎత్తి నడవాల. అదికారం వచ్చిందా తలొంచి నడవాల.''

''ఎంత మంచి మాటరా? బతుకును అట్నే పిండి పోసేసినారు గదరా?''

''అది గదన్నా నా బాద. ఇంకొక మాట యింటివి గదా అట్టహాసం రెట్టమదంగా అంట. ఎటువంటి మాటలు? వరాల మూటలు గదా? ఇప్పటికే ఎన్నో గాల్లో కల్సిపాయ్‌నాయి. పాయ్‌నివి పోగా దొరికిన కాడికి ఏరుకుందామని నా ఎతలు నావిగా ఉంటే జరగతా ఉండే కతలు ఎట్టుండాయి? గెడ్డివామి కాడ కుక్కల కతగా ఉండాదే?''

''అప్పుడెప్పుడో చేమకూర వెంకటకవి అట్టాంటోడే యిట్నే సంగట పణ్ణాడంట. ఇదేం కొత్తగాదు. ఈ పంగమాల్నె ఆలోచన్లు ఖుడ్సి పెట్టెయ్. నువ్వు చెప్పాలనుకుణ్ణింది నువ్వు చెప్పగలిగింది చెప్పుకుంటా పో. అంతే!''

''మా యబ్బతో చెప్తా ఉండానన్నా! ఈ యిల్లామల్లీరాతలు రాసే దెందుకు? మన కూడు మనం తిని మన గుడ్డ మనంగట్టి కన్నోడి దగ్గిరశనాకష్టమయిన మాట పడేదెందుకు? ఇంక చాలించుకుందాం. అనుకుంటా ఉంటే- దేముడి మాదిర్తో వస్తివి. బుజంతట్టి బుజ్జగిస్తివి. ఇంక తిరిగీమల్లి చూసేదిలే. ఇట్ట గాదురా నాయనా! యిద్దో యిట్ట! అని చెప్ప గలిగిన మహన్నబావులుంటే చెయ్యెత్తి దణ్ణం పెడ్తా. ఒప్పకుండా గొప్పకు పోతే అది వాడి కర్మ అని యిడ్సి పెట్టేస్తా.''

''అదీ సాపర్దాయకుడి లచ్చిణం.''

''అయితే ఈ వారం ఏమి రాస్తా ఉండానో చెప్పమంటావా?''

''ఇయ్యేరవదాకా ఏడ్సిన ఏడుపు అదేగదరా?''

''అయితే చెప్తా ఉండా. దేన్నికైనా మంచిది గుండికాయిని రొంత జాగర్తగా పెట్టుకో. ఈ వారం 'దరిద్రమా నీకు కోటిదండాలు!' అని రాస్తా ఉండా.

''దరిద్రానికి కోటి దండాలా? ఉండమనా? పొమ్మనా?''

''పోతే ఎట్టన్నా? దాన్ని నమ్ముకోని ఎంతమంది బతకతా ఉండారు? ఏంకత?''

''అబ్బారే! ఈపొద్దు నువ్వు ఏందో శానా యిపరీతంగా మాట్లాడతా ఉండావ్. దరిద్రాన్ని నమ్ముకోని యాడైనా ఎవుడైనా ఎట్ట బతకతార్రా?''

''బల్లికే శాస్త్రాలు చెప్పే మొనగోడు గదన్నా నువ్వు. నువ్వే అట్టంటే ఎట్టబ్బా? లచ్చిమక్క ఉండాదే ?- ఆమె యాకొంపలో అడుగు పెట్టాలన్నా అరవైయిదాలుగా

ఆలోచిస్తింది. గడపదాకా వచ్చిగూడా ఎనుకూముందు ఆలోచిస్తింది. ఆ వగలాడికి ఆ వలపచ్చిం ఎందుకోగానీ ఉండేచోట్నే చేరాలని చేరుకుంటింది. దరిద్రదేవత అట్ట గాదే?- ఇద్దో నేనుండాను! అంటింది. ఆ మహాతల్లి అట్టుండాది కాబట్టే కవులు బతికి పోతా ఉండారు. పోనీ! నువ్వే చెప్పన్నా. ఈ దరిద్రమే లేకుంటే మనం మార్క్సును గురించి అనుకండే వాళ్లమేనా? శ్రీ శ్రీ గూడా మామూలు కవిగా ఉండి పొయ్యుణ్ణేగానీ మహాకవి అనిపించుకుండే వాడేనా?

కవులు రచయితల కతల ఆడికైతే యింక సిల్మాలుండాయి గదా? దరిద్రాన్ని యీాలైనంత అందంగా తెరమిందికి ఎక్కించి దరిద్రుణ్ణి యింకా దరిద్రుణ్ణి చేసేస్తా ఉండాయి.

ఇంక కొంతమంది నోట్లో నాలికుండే నాయాండ్లు ఉండారు. మీటింగులు పెట్టి దరిద్రాన్ని గురించి మాట్లాడే దానికి ఏసీ కార్లలో వస్తారు. వాళ్ల మాటలు యింటావుంటే- ఎందుకులే? కన్నుమూసి తెర్సేలోపల గుడిసిలన్నీ మేడలైపోతాయేమో అనిపిస్తా ఉంటింది.

ఇంక మన నాయకులుండారు. మహన్నబావులు వాళ్ల కతలు చెప్పాల్నా? 'ఇద్దో తరిమేస్తాం! అద్దో తరిమేస్తాం' అని మైకుల ముందర నిలబడి మైకం వచ్చినట్లు మాట్లాడ్తారు. మాటలు కోటలు దాట్తాయి. దరిద్రం గడప దాటదు.''

''ఒరే ఒరే! అబ్బారే! యిప్పుడు పాయింట్ కొకేసారి ఉచ్చికెక్కె గదరా? ఆరున్నర కోట్ల తెలుగోళ్లకు అన్న అదే మన ముక్కెమంత్రి ఆరునూరైనా నూరుఆరైనా కిలో రొండ్రూపాయల బియ్యం యిచ్చేది మాత్రం నిలిపేది లేదన్నాడా?''

''అట్టా ఇట్టా అన్నాడా? రొమ్ము యిర్సుకోని గదా మొనగోడు అనింది?''

''ఎందుకు అన్నాడంటావ్?''

''బీదా బిక్కీ మింద ఉండే కనికారంతో అన్నాడు.''

''ఒరే పిచ్చోడా! ఆడేరా చిన్న లిటిగేషన్ ఉండేది. ఇంతదూరం ఆలోచించిన వాడివి. దీన్ని గూడా ఆలోచించి ఉండాల్సింది. ఎప్పటికీ రొండు రూపాయిల బియ్యం యిస్తానే ఉంటానంటే దాని అర్థం ఏంది? వాళ్ల సెగితి రొండు రూపాయిల బియ్యం కొనుక్కుండే దానికంటే మించరాదని. అంతేనా? అంటే- యాడుండావే గొంగిళీ! అంటే ఏసినచోట్నే అన్నెట్టు వాళ్లు అట్నే ఉండాల. రొండు రూపాయిల బియ్యం యిస్తా వుండామంటా ఈళ్లు యిట్నే ఉండాల. రొండురూపాయిలు గాదు అంతకు రొండింతలైనా కొనుక్కుంటామనే సెగితి వాళ్లకు వచ్చిందనుకో! అప్పుడు వాళ్లు చెప్పిన మాట యింటారా?''

''బలే బాగుంది గదన్నా రాజికీయం!'' అంటే-

''అయితే పో! రాసుకోపో!'' అనె.

''బయిసి ఉండేవాడు యిట్టా చెప్తాడు. లేనోడు వగస్తాడు.'' అనుకుంటా ముత్తారెడ్డన్నకు రొండు చేతులెత్తి దణ్ణం పెట్టి. ●